సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం । 19 । మార్చి । 2024

ఆటాడుకుందాం..రా



కాజీపేట రైల్వే స్టేడియానికి కలర్‌ఫుల్ ఆయిల్ పేయింటింగ్స్ వేయించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో స్టేడియం ముందు ఎం ట్రెస్స్ ప్రాంతమంతా ఆహ్లాదంగా కనిపించాలని గోడపై క్యారమ్స్, చెస్, బిలియర్డ్స్, నృత్య ప్రదర్శన, షటిల్, క్రికెట్, ఫుట్‌బాల్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎంబ్లమ్ బొమ్మలు గీయించినట్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. - కాజీపేట రూరల్



ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పద్మావతి



కాశిబుగ్గ: వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పద్మావతి హైదరాబాద్ ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆమె తిరిగి సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ జగన్‌మోహన్‌చారికి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కొనసాగనున్నారు. పద్మావతికి డాక్టర్లు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పీజీ పరీక్షలు



కేయూ క్యాంపస్: కేయూలో పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం క్యాంపస్‌లోని వివిధ విభాగాల పరీక్ష కేంద్రాలను కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్ నర్సింహాచారి పరిశీలించారు.

21 నుంచి బీఈడీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 21 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ రాధిక తెలిపారు. ఈనెల 21, 23, 26, 28, 30, ఏప్రిల్ 1న పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వరల్డ్ కేన్సర్ కాంగ్రెస్‌కు ప్రొఫెసర్ రామేశ్వరం




కేయూ క్యాంపస్: న్యూఢిల్లీలోని జేఎన్‌యూలో సోమవారం ప్రారంభమైన వరల్డ్ కేన్సర్ కాంగ్రెస్‌కు కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, సైకాలజిస్ట్ గజ్జల రామేశ్వరం తరలివెళ్లారు. ఈసమావేశాలు మూడ్రోజులపాటు జరగనున్నాయి. 'ప్రకృతి వైద్య చికిత్స పద్ధతుల ద్వారా రెండు శతాబ్దాల చారిత్రక సాక్ష్యాలు' అంశంపై రామేశ్వరం మంగళవారం తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు.

అనుమతి ఉంటేనే ఎన్నికల సామగ్రి ముద్రించాలి



హన్మకొండ అర్బన్: ఎన్నికల సామగ్రి, కరపత్రాలు, పోస్టర్లు ముద్రించాలంటే సంబంధిత అభ్యర్థి, పార్టీ జిల్లా ఎన్నికల అధికారి నుంచి అనుమతి పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సామగ్రి ముద్రణ సమయంలో పత్రాలపై ముద్రణ సంస్థ, ప్రింటింగ్ ప్రెస్‌పేరు, ఎన్ని ప్రతులు ముద్రిస్తున్నారు? అనే విషయాలు స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఇతరులను దూషించేలా, రెచ్చగొట్టేలా, కించపర్చేలా ఉన్న వాటిని ముద్రించకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఆర్నెళ్ల జైలు శిక్ష, లేదా రూ.2వేల జరిమానా, లేదా రెండూ విధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఏవీఎన్వీ ప్రసాద్‌రావు, ప్రింటర్లు, పబ్లిషర్లు పాల్గొన్నారు.

నామినేటెడ్‌లో మొండిచేయి!



పలువురు సీనియర్ నేతలకు దక్కని అవకాశం

- రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికే స్థానం
- గత ప్రభుత్వ హయాంలో 11 మందికి చాన్స్
- ఎమ్మెల్యే టికెట్ వదులుకున్నా.. దక్కని ప్రాధాన్యం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన వారిలోనూ నిరాశ
- ముఖ్యులను కలిసేందుకు సిద్ధమైన నేతలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు సీనియర్లను అసంతృప్తికి గురి చేసింది. నెల రోజుల కిందట మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించడంతో జిల్లాకు నామినేటెడ్ పదవుల తాకిడి మొదలైంది. రెండు రోజుల కిందట మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 37 మందికి వివిధ కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను కట్టబెట్టింది. ఇందులో ఉమ్మడి వరంగల్‌కు చెందిన జంగా రాఘవరెడ్డి, అయిత ప్రకాష్‌రెడ్డి, బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి ఎండీ రియాజ్‌కు అవకాశం దక్కింది. పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఇనుగాల వెంకట్రాంరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ పదవి దక్కింది. ఉమ్మడి వరంగల్‌లో ఉన్న పలువురు సీనియర్లు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా పోటీనుంచి తప్పుకోవాల్సి వచ్చిన నేతలు, ఎమ్మెల్యేగా ఓటమి చెందిన వారికి ఈ జాబితాలో ప్రాధాన్యం దక్కకపోవడం చర్చనీయాంశమైంది.

మరో జాబితాలోనైనా..

ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు.. టికెట్ రేసు నుంచి అనూహ్యంగా తప్పుకున్న నాయకులు.. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందిన వారు.. ఇలా అనేక మంది నామినేటెడ్ పోస్టులను ఆశించారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సింగపురం ఇందిరకు చాన్స్ దక్కలేదు. వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్, సీనియర్ నేతలు ఈవీ శ్రీనివాస్‌రావు, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, డాక్టర్ కత్తి వెంకటస్వామి, బండి సుధాకర్ గౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, బక్క జడ్సన్‌కు కూడా దక్కలేదు. పాలకుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేసి ఆమె కోడలు యశస్వినిరెడ్డిని బరిలో దింపి గెలిపించిన హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి ప్రొటోకాల్ కోసం రాష్ట్రస్థాయి పదవి వస్తుందని ఆశించినా అదీ జరగలేదు. అదే విధంగా ఇంకా కొందరు సీనియర్లు వరంగల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్నందున్న వారి పేర్లను పరిశీలనలోకి తీసుకోలేదని అనుకున్నా.. ఉమ్మడి వరంగల్ నుంచి నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురికి తొలి జాబితాలో చోటు దక్కకపోవడం నిరాశకు గురి చేసింది. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యులను కలిసి మరోమారు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉమ్మడి వరంగల్‌లో పదకొండు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కగా, ఈసారి ఐదే భర్తీ అయినందున మరో జాబితాలోనైనా తమకు అవకాశం దక్కాలని కోరుకుంటున్నారు.

కనిపించని మంత్రుల మార్క్..

నామినేటెడ్ పోస్టుల భర్తీలో మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ మార్కు కనిపించలేదన్న చర్చ కాంగ్రెస్ సర్కిళ్లలో జరుగుతోంది. ఇటీవల భర్తీ చేసిన మొత్తం ఆరు పదవుల్లో ఐదు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, ఒకటి జిల్లాస్థాయి పదవి ఉంది. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కోటాలో పదవి దక్కింది. మిగతా పదవులు మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలకు, వారి శాసనసభ నియోజకవర్గాల్లోని నాయకులకు దక్కకపోవడంపై పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ నుంచి జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, ఎండీ.రియాజ్‌కు తెలంగాణ గ్రంథాలయ పరిషత్, పరకాల నుంచి ఇనుగాల వెంకట్రాంరెడ్డికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో జంగా రాఘవరెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డిలు ఎమ్మెల్యే టికెట్ ఆశించి అనూహ్యంగా తప్పుకున్నారు. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇప్పించుకున్నట్లు ప్రచా రం ఉంది. మహబూబాబాద్ జిల్లా నుంచి టికెట్ ఆశించిన బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్ పదవి దక్కగా.. ములుగు, జనగామ, వరంగల్ జిల్లాలకు నామినేటెడ్ పోస్టుల్లో మొండిచేయి చూపారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న వరంగల్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

- వరంగల్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య
- సీపీ, ఎన్నికల అధికారులతో సమీక్ష

కరీమాబాద్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అధికారులు బాధ్యతగా పని చేయాలని వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాతో కలిసి హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 1.899 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటిలో 419 సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాల్ని దృష్టిలో పెట్టుకుని మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

సమన్వయంతోనే విజయవంతం

సమన్వయంతో పని చేసి ఎన్నికలను విజయవంతం చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. అదే స్ఫూర్తితో ఏఆర్‌ఓలు, ఏసీపీలు సమన్వయంతో నివేదికలు అందించాలన్నారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తూ.. ఉల్లంఘనలు జరగకుండా చూడాలన్నారు. భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సాయంత్రం నాలుగు గంటలకే పోలింగ్ పూర్తవుతుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అధిక భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా రోజువారీ నివేదికలు తప్పనిసరిగా అందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అధికారులకు విధులు కేటాయించినట్లు, అదనంగా డేటా ఆపరేటర్లను నియమించుకోవాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే, డీసీపీలు బారీ, రవీందర్, సీతారాం, ఏఆర్‌ఓలు అశ్వినితానాజీ వాకడే, కె.శ్రీనివాస్, డీఎస్ వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, రాధిక గుప్తా, గణేశ్, ఉప ఎన్నికల జిల్లా అధికారులు పీయూష్ కుమార్, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలి

కరీమాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం జిల్లా ఎన్నికల ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మద్యం, గంజాయి, నార్కోటిక్స్ రవాణా జరగకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, ఆర్డీఓ కృష్ణవేణి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ సత్యనారాయణ, నార్కోటిక్స్ ఎస్పీ సైదులు, మహేందర్‌బాబు, నాగేంద్రరావు, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీటీసీడీఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీల వివరాలివ్వండి

ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. రోజుకు రూ.లక్షకుపైగా బ్యాంక్ లావాదేవీల వివరాలు ఇవ్వాలని వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని వివిధ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. నెలలో రూ.10 లక్షలకు పైగా నగదు లావాదేవీలు జరిపితే ఆ వివరాలను ఎన్నికల అధికారులకు అందించాలన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే లావాదేవీలపై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వివిధ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

రూ.15వేలకు కొని రూ.25వేలకు అమ్మకం

- యువతిని బలవంతంగా వ్యభిచార రొంపిలోకి దింపిన మహిళలు
- వంగపహాడ్ వేశ్యగృహం నుంచి తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు
- యువతిది జోగులాంబ గద్వాల జిల్లా

హసన్‌పర్తి: రూ.15వేలకు కొని.. రూ.25వేలకు అమ్మింది. ఇదేదో సంతలోని పశువునో.. ఏదైనా వస్తువో అనుకుంటే పొరపాటు. ఒంటరిగా ఉన్న యువతికి మాయమాటలు చెప్పిన ఇద్దరు మైనర్లు, వారి తల్లినుంచి ఓ మధ్యవర్తి కొన్నరేటు రూ.15వేలు అయితే.. ఆమె తిరిగి వ్యభిచార గృహ నిర్వాహకులకు అమ్మింది రూ.25వేలకు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని ఓ ప్రాంతంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంనుంచి ఓ యువతి తప్పించుకుంది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లుగా పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఓ యువతి టెలికాలర్ జాబ్ నిమిత్తం ఈనెల 10వ తేదీన హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండ్‌లో దిగింది. ఒంటరిగా ఉండడం గమనించిన ఇద్దరు మైనర్ బాలికలు ఆమెకు మాయమాటలు చెప్పి హైదరాబాద్‌లోని తమ ఇంటికి తీసుకెళ్లారు. యువతి విషయాన్ని తల్లి మమతకు చెప్పారు. వారి మాటలు నమ్మిన ఆ యువతి రెండు రోజులపాటు హైదరాబాద్‌లోనే ఉంది.

రూ.15వేలకు విక్రయం

ఆ యువతిని బ్రోకర్‌గా వ్యవహరిస్తున్న గీసుకొండకు చెందిన పాకనటి శివమ్మకు రూ.15వేలకు విక్రయించారు. మొదట శివమ్మతో వెళ్లడానికి ఆ యువతి అంగీకరించలేదు. దీంతో మమత, ఆమె సోదరి చందన ఆ యువతిని నిర్బంధించారు. తాళ్లతో చేతులు కట్టి, సెల్‌ఫోన్, బ్యాగ్‌తోపాటు అందులో ఉన్న రూ.2వేలు లాక్కున్నారు. అనంతరం పాకనటి శివమ్మకు అప్పగించారు. ఆమె ఈ నెల 12న యువతిని కారులో ఎక్కించుకుని వంగపహాడ్‌కు చేరుకుంది.

ఇక్కడ రూ.25వేలకు అమ్మకం

హైదరాబాద్‌లో రూ.15వేలుకు కొనుగోలు చేసిన శివమ్మ వంగపహాడ్‌లో శ్యామ్‌రావుకావ్యకు రూ.25వేలకు విక్రయించింది. రెండు రోజులపాటు వ్యభిచారం చేయాలని బలవంతం చేసింది. అందుకు ఆ యువతి అంగీకరించలేదు. ఈనెల 14న బాధితురాలు వ్యభిచార గృహం నుంచి తప్పించుకుంది. ఓఆర్ఆర్ వద్ద భూక్యా రాజు అనే యువకుడిని మోటార్‌సైకిల్‌పై లిఫ్ట్ తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చందన, మమత, ఇద్దరు మైనర్ బాలికలతో పాటు కావ్య, శివమ్మను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

టెన్త్ పరీక్షలు షురూ



హనుమకొండ ప్రాక్టీసింగ్ స్కూల్ సెంటర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నిర్దేశించిన సమయానికి ముందుగానే చాలా మంది పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడక్కడా ఉరుకుల పరుగుల మీద చేరుకున్నారు. విద్యార్థులతోపాటు కొందరు తల్లిదండ్రులు కూడా వెంటరావడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. తొలిరోజు తెలుగు పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,014 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 12,000 మంది (99.88 శాతం) హాజరయ్యారని డీఐఈఓ ఎండీ అబ్దుల్‌హై, డీఈఓ కార్యాలయం ఏసీజీ చలపతిరావు తెలిపారు. అలాగే ఇద్దరు ప్రైవేట్ అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా మూడు పరీక్ష కేంద్రాలు, డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఏసీజీ చలపతిరావు ఏడు పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు 21 కేంద్రాలను పరిశీలించారు.



కుమారుడికి ఆల్‌ది బెస్ట్ చెబుతున్న తండ్రి, కూతురుకు ముద్దు ఇస్తున్న తల్లి

వరంగల్ జిల్లాలో..

కాశీజీ సెంటర్/కరీమాబాద్: వరంగల్ జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి, ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో కలిసి పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 9,448 మందికి గాను 20 మంది గైర్హాజరు అయినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. కలెక్టర్ తనిఖీల్లో భాగంగా వరంగల్ శంభునిపేట పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.



వరంగల్ శంభునిపేట సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కాశిబుగ్గ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు, శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



కాలు విరిగినా పరీక్షకు..

కాలు విరిగిన ఓ విద్యార్థి పదో తరగతి పరీక్ష రాశాడు. వరంగల్ జిల్లా మామునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదివిన లక్ష్మణ్‌సింగ్‌కు ఇటీవల ప్రమాదంలో కాలు విరిగింది. సిమెంట్ పట్టి వేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభంకాగా, నగరంలోని శంభునిపేట పాఠశాలలో సెంటర్ పడింది. కుటుంబ సభ్యులు అతడిని ఆటోలో కేంద్రానికి తీసుకువచ్చారు. డాక్టర్ సూచన మేరకు కేంద్రంలో ఆ విద్యార్థిని ప్రత్యేకంగా వరండాలో కూర్చోబెట్టడంతోపాటు కాలుకు ఎత్తుగా దిండును ఉంచి పరీక్ష రాయించారు.

ఫొటో : సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్

పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని రెండు ప్రైవేట్, ఒక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు యథేచ్ఛగా సెల్‌ఫోన్లు తీసుకెళ్లినట్లు తెలిసింది. సెల్‌ఫోన్లు డిపాజిట్ చేసి కేంద్రాలకు వెళ్లాలని డీఈఓ వాసంతి ఆదేశించినా ఇన్విజిలేటర్లు భయం లేకుండా ఎలా తీసుకెళ్లారో తెలియని పరిస్థితి. ఇదంతా గమనించినా ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పట్టించుకోలేదని తెలుస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే ఎంతమంది సెల్‌ఫోన్లు తీసుకెళ్లారు.. ఏమైనా పేపర్ బయటికి వెళ్లిందా.. అక్కడినుంచి ఎవరితో మాట్లాడారో బయటపడుతుందని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

హలో.. మీ జాబ్ కన్ఫామ్!

- ఉద్యోగాలిప్పిస్తామంటూ మెరిట్ అభ్యర్థులకు ఫోన్ కాల్స్
- ఆపై పెద్ద ఎత్తున వసూళ్లు!
- డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అధికారుల లీలలు

ఎంజీఎం: హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏదైనా పోస్టు ఖాళీ కావడంతోనే గుట్టు చప్పుడు కాకుండా కమిషనర్, కలెక్టర్ అనుమతులు తీసుకున్నామని పేర్కొంటూ పదుల సంఖ్యలో పోస్టులు నింపారనే ఆరోపణలున్నాయి. ఈక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులు నింపేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని కలెక్టర్లకు, డీఎంహెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు.. ఈప్రక్రియలో సైతం అందిన కాడికి దండుకుందామని కొత్త పంథాలు తొక్కుతున్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా.. మెరిట్ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలతో మెరిట్ లిస్ట్ తయారు చేశారు. ఈక్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

మెరిట్ అభ్యర్థులకు ఫోన్ కాల్స్..

మెరిట్ జాబితా తయారు చేసిన అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ఎవరికి ఉందో తెలుసుకుని వారికి ఓ పెద్దసార్ ఆదేశాలతో.. అజ్ఞాత నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ చేయిస్తున్నారు. కొంత మంది కార్యాలయ సిబ్బందిని పురమాయిస్తూ.. ఆ పెద్ద సార్ కొత్త నెంబర్లతో ఫోన్ కాల్స్ చేయిస్తూ.. మీకు జాబ్ ఇప్పిస్తామని అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వరంగల్ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పని చేసిన ఓఉద్యోగి మెరిట్ అభ్యర్థులకు కాల్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈతంతు కాస్తా.. ప్రస్తుతం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి మారిందని బహిరంగంగా చర్చ జరుగుతోంది.

ఆరోపణలు వస్తున్నాయి..

మెరిట్ అభ్యర్థులకు కొంతమంది సిబ్బంది ఫోన్ కాల్స్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి ఘటనలపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- నెహ్రూ చందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

క్లుప్తంగా

20 నుంచి ఇంటర్ రెండోదశ మూల్యాంకనం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకణం కొనసాగుతోంది. రెండోదశలో ఈనెల 20వ తేదీ నుంచి కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభించనున్నామని డీఐఈఓ గోపాల్ సోమవారం తెలిపారు. తొలుత ప్రకటించిన విధంగా ఈనెల 22న కాకుండా ముందుగానే ఈనెల 20వ తేదీ నుంచే ప్రారంభిస్తామని, సంబంధిత సబ్జెక్టుల అధ్యాపకులు గమనించాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు నియమించిన ఆయా సబ్జెక్టుల అధ్యాపకులు (ఏఈ,సీఈలు) ఈనెల 20న ఉదయం 10 గంటలకు హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల క్యాంపులో రిపోర్టు చేయాలన్నారు. కాగా, ఇప్పటికే మొదటి దశలో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, హిందీ, పొలిటికల్‌సైన్స్ సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది.

చక్కటి దుస్తులు, కళ్లద్దాలు ధరించి వచ్చి..

- చిరువ్యాపారులను మాటల్లో దింపి చోరీలకు పాల్పడుతున్న దుండగుడు
- రూ. లక్షన్నర వరకు అపహరణ



కాజీపేట: ఓ వ్యక్తి.. చక్కటి దుస్తులు, కళ్లద్దాలు ధరించి ద్విచక్ర వాహనంపై దర్జాగా పూలు, పండ్లు, కూరగాయల కొనుగోలు కోసం ఆయా దుకాణాల వద్దకు వస్తాడు. అన్ని సరుకులు పెద్ద ఎత్తున ప్యాక్ చేసి ఇవ్వాలని వ్యాపారులకు చెబుతూ నమ్మిస్తాడు. ఇదీ నమ్మిన వ్యాపారులు సరుకులను ప్యాక్ చేసే ప్రయత్నంలో ఉండగా సమయం చూసి గల్ల పెట్టెలో ఉన్న డబ్బులను తీసి జేబులో వేసుకుంటాడు. అనంతరం ఈ సరుకులు బాగాలేవంటూ అక్కడి నుంచి క్షణాల్లో మాయమైపోతాడు. ఆ తర్వాత గల్ల పెట్టె చూసుకుంటే ఖాళీగా కనిపించడంతో చిరువ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఇలా కాజీపేట పట్టణంలోని దాదాపు 10 దుకాణాల్లో దుండగుడు చేతివాటం ప్రదర్శించి సుమారు రూ.లక్షన్నర వరకు కాజేశాడు. కొంతకాలంగా జరుగుతున్న ఈ ఘటనలపై పలువురు వ్యాపారులు లబోదిబోమంటూ ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో చిరువ్యాపారుల నగదును తస్కరిస్తున్న నిందితుడి కదలికలను క్రైం పార్టీ పోలీసులు గుర్తించారు. చిక్కనట్లే చిక్కి చాకచాక్యంగా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా, సదరు వ్యక్తిని త్వరగా పట్టుకోవాలని పలువురు చిరువ్యాపారులు పోలీసులను కోరుతున్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

రక్తదానంలో రాజు.. సేవాతత్పరులు..

ప్రాణదాతగా నిలుస్తున్న పోలీస్ కానిస్టేబుల్

- అత్యధికంగా 33 సార్లుదానం.. పలువురికి అవగాహన
- 235 మందికి ప్లాస్మా సమకూర్చడంలో కీలక పాత్ర
- వరించిన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు

నర్సంపేట: ఖాకీ చొక్కా .. కర్కశత్వానికి ప్రతీకని పలువురి వాదన. అయితే ఆ చొక్కా వెనుక మానవత్వపు గుండెలు కూడా ఉంటాయని నిరూపిస్తున్నాడు ఓ కానిస్టేబుల్. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోపక్క సామాజిక సేవలో ముందంజలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. అత్యవసర పరిస్థితుల్లో పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నాడు. తానొక్కడే కాక సోషల్ మీడియా ద్వారా కూడా మరింత మందిని ప్రాణదాతలుగా నిలుపుతున్నాడు. రక్తదానంలో రాజుగా పిలుచుకునే వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కన్నె రాజు అలియాస్ సిమ్మర్ రాజుపై 'సాక్షి' కథనం. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట చెందిన కన్నె కుమారస్వామి, రమణి దంపతుల కుమారుడు రాజు ఇంటర్ వరకు అక్కడే చదువుకున్నాడు. డిగ్రీ నర్సంపేటలో పూర్తి చేశాడు. అనంతరం కేయూలో పీజీ చదివారు. 2009లో ఏఆర్ (అర్మ్‌డ్ రిజర్వ్‌డ్) కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

వరించిన పలు అవార్డులు

పోలీసు కొలువులో చేరకముందు నుంచే రాజు సమాజ సేవకు ఆకర్షితుడయ్యాడు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో తాపత్రయపడేవాడు. ఈక్రమంలోనే రక్తదానంతో పలువురిని ప్రాణాపాయం నుంచి రక్షించగలిగాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత 2016 కొత్తకొండ అరుణ్ కుమార్‌తో పరిచయడం ఏర్పడింది. అనంతరం ఇద్దరు కలిసి యువ నేతాజీ ఫౌండేషన్ ఏర్పాటు చేసి 21 వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. సుమారు 5వేల మందిని సభ్యులుగా చేర్చాడు. ఆయా గ్రూపుల్లో ఎలాంటి ఆపదకు సంబంధించిన సమాచారం కనిపించినా.. అందుబాటులో ఉన్న టీమ్ అక్కడికెళ్లి అవసరమైన సహకారం అందించేలా కార్యాచరణను సిద్ధ చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆపదలో ఉన్నవారికి 33 సార్లు.. 13వేలకు పైగా యూనిట్ల రక్తం అందించడంలో కీలకపాత్ర పోషించాడు. అంతేకాదు రాజు స్వయంగా 20 రక్తదాన శిబిరాలు నిర్వహించాడు. తలసేమియా బాధితులకు 16 రక్తదాన శిబిరాల ద్వారా 850కి పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారు. అలాగే, 235 మంది కోవిడ్ పేషెంట్లకు ప్లాస్మా సమకూర్చడంలో విశిష్ట సేవలు అందించారు. అలాగే, మూఢ విశ్వాసాలపై కూడా రాజు.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ కళాశాలలు, గ్రామాల్లో 30వేలకు పైగా సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చాడు. ఇందుకు రాజును ఇప్పటి వరకు 70 అవార్డులు వరించాయి. ఇందులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు ఉన్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణమాజీ గవర్నర్ తమిళిసై నుంచి అవార్డులు స్వీకరించారు.



కోవిడ్ -19 సమయంలో రక్తదానం,అన్నదానం, ప్లాస్మాదానం చేసినందుకు రాజును సన్మానిస్తున్న, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సమాజ సేవలో తృప్తి



ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో తృప్తినిస్తుంది. 2005 నుంచి ఇప్పటి వరకు 33 సార్లు రక్తదానం చేశా. రక్తదానం చేయడం కోసం చాలా మందికలవడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతా.

- కన్నె రాజు, కానిస్టేబుల్

స్ఫూర్తి

రంజాన్ సందర్భంగా ఉచితంగా గంజి పంపిణీ

- ఉపవాస దీక్షాపరులకు రోజూ అందజేత
- ఆదర్శంగా నిలుస్తున్న మహ్మద్ జహంగీర్, ఎండీ అమ్జద్

ఖిలా వరంగల్ : రంజాన్ ఉపవాస దీక్షల్లో గంజికి విశేష ప్రాధాన్యం ఉంది. ఉపవాస (రోజా) దీక్షాపరులు గొంతెండుతున్న రోజంతా మంచినీరు ముట్టరు. కనీసం లాలజలం కూడా మింగరు. ఖాళీ కడుపుతోనే ఉపవాసం చేస్తారు. అంతలా నిష్టగా ఉంటారు. అయితే సాయంత్రం 6 గంటల తరువాత ఉపవాసం విరమించి తమకు ఇష్టమైన ఆహారంతోపాటు అధిక శక్తినిచ్చే పదార్థాలు తీసుకుంటారు. అధిక శక్తినిచ్చే పదార్థాల్లో గంజి కూడా ఒకటి. ఈ క్రమంలో కొందరు సేవాభావంతో గంజిని తయారీ చేసి ఉపవాస దీక్షాపరులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరంగల్ శివనగర్‌కు చెందిన మహ్మద్ జహంగీర్, ఎండీ అమ్జద్ మరికొంత మంది కలిసి దాతల సహకారంతో గంజిని పంపిణీ చేస్తున్నారు.

గంజి తాగితే శరీరంలో వేడి తగ్గుతుంది

రైల్వేగేట్ ప్రాంతంతోపాటు నగరంలోని అనేక మసీదుల్లో ప్రార్థనలు చేసే వేలాది మంది దీక్షాపరుల కోసం ఈ వంటకాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. గ్లాసు గంజి తాగితే శరీరంలో వేడి తగ్గుతుందని దీక్షాపరులు చెబుతున్నారు. బలవర్థక ఆహారంగా పేరొందిన ఈ పంటకాన్ని మసీదుల్లోనే తయారు చేయడం విశేషం. ఉపవాస దీక్షాపరులు విరమణ సమయంలో గంజి తాగేందుకు పోటీపడుతారు.

భక్తిశ్రద్ధలతో గంజి పంపిణీ

రంజాన్ నెల మొత్తం మసీదుల్లో ఉపవాస దీక్షాపరులకు ముస్లిలు గంజి పంపిణీ చేస్తున్నారు. గంజి తయారీకి పలువురు ఆర్థిక సహకారం అందజేస్తారు. మసీదుల్లో రోజూ మధ్యాహ్నం 2గంటల తర్వాత గంజి తయారీని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 నుంచి పంపిణీ చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఈ ద్రావణాన్ని సిద్ధం చేసి ఇఫ్తార్‌లో పాల్గొన్న దీక్షాపరులకు అందజేస్తారు.



శివనగర్‌లో గంజి తయారు చేస్తున్న జహంగీర్

తయారీ ఇలా..

బియ్యం రవ్వ లేదా బొంబాయి రవ్వ, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, టమాట, కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, పచ్చిమిర్చి, వేరుశనగలు, లవంగాలు, యాలకులు, చెక్క, నూనె, నెయ్యి ఉపయోగించి గంజి తయారు చేస్తారు. కొన్ని మసీదుల్లో ఖీమా కూడా వినియోగిస్తారు. సాయంత్రం నమాజ్ తర్వాత ఉపవాస దీక్షాపరులకు పంపిణీ చేసి మహిళా ఉపవాస దీక్ష పరుల కోసం ఇంటింటికీ గంజి అందజేస్తారు. సేవాభావంతో తయారు చేసిన నిర్వాహకులు మసీదుల్లో గిన్నెల్లో పోసి ప్రార్థన వచ్చిన వారికి అందిస్తారు. దీనిని కొంత మంది ముస్లిలు గంజిపై బోందీ వేసుకుని కూడా ఇష్టంగా తింటారు.

గంజి అధిక శక్తినిస్తుంది



ఇస్లాం మతంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. 30 రోజుల పాటు చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉపవాసదీక్షలు చేస్తారు. దీక్ష విరమణ అనంతరం అలసట రాకుండా తొలుత అధిక శక్తినిచ్చే గంజిని సేవిస్తాం. ఉపవాస దీక్షాపరులకు దాతలు మసీదుల్లో ఉచితంగా గంజిని పంపిణీ చేసి తమ సేవాభావం చాటుకుంటారు.

- ఎంఏ జబ్బార్, ఈద్గా అధ్యక్షుడు ఫోర్ట్ వరంగల్

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

కరీమాబాద్: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని, తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేస్తే అద్భుత ఫలితాలు సాధించొచ్చని చెప్పారు. ములుగురోడ్డు సమీపంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండు రోజులు నిర్వహించనున్న వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాలను సోమవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. రైతులు ఒకరికొకరు పంటల సాగులో తమ అనుభవాలు తెలుసుకుంటూ అనువైన పద్ధతులు పాటించడం వల్ల వ్యవసాయంలో ప్రగతి సాధించొచ్చన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ రావుల ఉమారెడ్డి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురాంరెడ్డి, డాక్టర్ సుధారాణి, జేడీఏ సుజాత, ఉషాదయాళ్, రవీందర్‌సింగ్, శ్రీనివాస్, డాక్టర్ బలరాం, నాబార్డ్ జీఎం చంద్రశేఖర్, డాక్టర్ దిలీప్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, రాణాప్రతాప్‌తోపాటు తెలంగాణలోని 11 జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్

పున్నేలు క్రాస్ వద్ద వాహన తనిఖీలు

- రూ.11.14 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



తనిఖీలు చేపడుతున్న ఎస్సై అనిల్‌కుమార్

ఐనవోలు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విస్తృ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై గైకడి అనిల్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కందగట్ల శివప్రసాద్ అనే వ్యక్తి వద్ద రూ.11 లక్షల 13 వేల 976 విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలను విచారణ నిమిత్తం ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

13 ఏళ్లుగా .. వెంటాడిన మృత్యువు

చికిత్స పొందుతూ ఈఎంటీ స్వప్న మృతి

- రెండు దఫాలు రోడ్డు ప్రమాదానికి గురైన 108 వాహనం
- మెదడులో బలమైన గాయం.. 7నెలలు విధులకు దూరం
- చివరికి చికిత్స కోసం అదే వాహనంలో వెళ్లి కన్నుమూత
- ఉద్యోగిగా గుర్తించని ప్రస్తుత యాజమాన్యం.. ఆదుకోవాలని వేడుకోలు



చికిత్స పొందుతున్న స్వప్న(ఫైల్)



స్వప్న (ఫైల్)

హన్మకొండ అర్బన్: 108.. ఈ నంబర్ వినగానే మృత్యువు దారిదాపుల్లో ఉన్న వారి ప్రాణాలు లేచి వస్తాయి. ఈ వాహనం.. వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ఎంతో మందిని మృత్యువు అంచుల నుంచి కాపాడుతోంది. అయితే అదే వాహనం.. తన వద్దే ఈఎంటీగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని బలితీసుకుంది. ఆ ఉద్యోగిని విషయంలో మృత్యువు 13 ఏళ్ల నుంచి వెంటాడుతోంది. రెండు సార్లు రోడ్డు ప్రమాదాలకు గురి చేసింది. ఫలితంగా అందరికీ ప్రాణదాతగా ఉన్న 108 వాహనం తమ ఉద్యోగి పాలిట మృత్యుశకటంగా మారి బలితీసుకున్న ఘటన సహా ఉద్యోగులు, బాధిత ఉద్యోగి కుటుంబీకులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.

వివరాల్లోకి వెళ్తే..

దివంగత నేత వైఎస్సార్ 108 వాహనాలు ప్రారంభించిన తొలిరోజులు.. 2007లో హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన సూదమళ్ల స్వప్న ఈఎంటీగా విధుల్లో చేరారు. విధుల్లో చురుకుగా ఉండే స్వప్న ఉత్తమ పనితీరుతో సహా ఉద్యోగులు, ఉన్నతాధికారుల ప్రశంసలతోపాటు పలు అవార్డులు అందుకున్నారు. విధుల్లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆలేరు, హనుమకొండ, ఏటూరునాగారం, తాడ్వాయి, పరకాల తదితర ప్రాంతాల్లో పనిచేశారు. 108 వాహనంలో 108 ప్రసవాలు చేసి రికార్డు సృష్టించారు. ఇలా హుషారుగా సాగుతున్న స్వప్న జీవితానికి, తన సంతోషానికి కారణమైన 108 వాహనమే ఈ విషాదానికి కారణమైంది. 2010 సంవత్సరంలోలో 108 వాహనంలో కేయూసీ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఓ ప్రమాద ఘటనా స్థలికి వెళుతుండగా కేయూసీ–హసన్‌పర్తి రోడ్డులో తమ 108 వాహనం ఘోర ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వప్న హైదరాబాద్‌లో చికిత్స పొందింది. అయితే మెదడులో తీవ్ర గాయం కావడంతో రక్తం గడ్డకట్టిందని వైద్యులు చెప్పారు. ఒకటికి మూడుసార్లు ఆపరేషన్లు చేశారు. అయినా పూర్తిగా కోలుకోలేకపోయింది. ఆర్థిక పరిస్థితి, ఆరోగ్యపరిస్థితి పూర్తిగా దిగజారడంతో మళ్లీ విధుల్లో చేరింది. కరోనా కాలంలో రెట్టించిన ఉత్సాహంతో విధుల్లో చేరింది. తన పునర్జన్మ కరోనా బాధితుల కోసమే అంటూ ధైర్యంగా పనిచేసింది. కానీ స్వప్న విషయంలో విధి వెక్కిరించింది. 108 రూపంలో వెంటాడుతున్న మృత్యువు మరోసారి దెబ్బతీసింది. 2021లో పరకాల 108 వాహనంలో పనిచేస్తూ ఓ క్షతగాత్రుడిని ఎంజీఎం తరలించి వెళ్తోంది. ఈ క్రమంలో 108 వాహనం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఫలితంగా తను పనిచేస్తున్న వాహనం రెండోసారి మృత్యుశకటమై ఆసుపత్రి పాలు చేసింది. నాటి నుంచి స్వప్న మంచానికే పరిమితమైంది. కొద్ది రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సహా ఉద్యోగులు తమకు తోచిన మేర ఆర్థిక సాయం చేశారు. దీంతో మరోమారు వారం క్రితం తను పనిచేసిన...తనను మృత్యుకూపంలోకి నెట్టిన 108వాహనంలో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లింది. అక్కడ వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా స్వప్న తిరిగి రాలేదు. ఆదివారం కనిపించని లోకాలకు తరలింది. అదే సంస్థ వాహనంలో విగత జీవిగా వచ్చింది. 13 ఏళ్ల స్వప్నను వెంటాడి వధించిన మృత్యువు తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం నింపింది.

ఉద్యోగి కాదంటున్న యాజమాన్యం

సుమారు దశాబ్దకాలం పాటు తమ సంస్థలో పనిచేసి విధుల్లో ప్రమాదానికి గురై మృతి చెందిన స్వప్న.. ప్రస్తుతం ఆ సంస్థకు కానిది అయింది. ఎందుకంటే కొద్ది రోజుల క్రితం సంస్థ పేరును 'గ్రీన్ హెల్త్ సర్వీస్'గా మార్చారు. మార్చిన తరువాత గతంలో ఉన్న ఉద్యోగుల నుంచి బయోమెట్రిక్, ఇతర సమాచారం తీసుకుని నమోదు చేసుకున్నారు. ఆ సమయంలో స్వప్న మంచానికే పరిమితమైంది. దీంతో తమ సంస్థలో పనిచేస్తున్నట్లు కొత్త ఐడీ నంబర్ ఉంటేనే గుర్తింపు ఇస్తామని సంస్థ చెపుతోందని సహా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇది అన్యాయమని వారు వాపోతున్నారు.

కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే..

కడు పేద కుటుంబంలో ఉన్న స్వప్న ఒంటరిగా ఉంటోంది. తన అక్కకు ముగ్గురు సంతానం. ఇందులో ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అక్కకు భర్త లేడు. దీంతో వారిలో ఒక కూతురును స్వప్న పెంచుకోవడంతోపాటు అక్క కుటుంబ బాధ్యతలు తనే చూస్తోంది. స్వప్న మృతితో ఇప్పుడు తమకు ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని ఆ కుటుంబం రోదిస్తోంది. దశాబ్దానికి పైగా 108లో సేవలందించి అందరికీ దూరమైన స్వప్న విషయంలో ప్రభుత్వం స్పందించాలని సహా ఉద్యోగులు, కుటుంబీకులు కోరుతున్నారు. సంస్థకూడా ఉద్యోగిగా గుర్తించి పరిహారం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. స్వప్న విషయంలో సంస్థ గుర్తింపు ఇవ్వడానికి సాంకేతిక కారణాలు చూపినా అందులో ఉన్న ఉద్యోగులు మానవత్వం చాటుకున్నారు. సంస్థ రాష్ట్ర బాధ్యుడు ఖలీద్ సూచన మేరకు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ ఆధ్వర్యంలో స్వప్న అంత్యక్రియలకు ఆదివారం రూ. 10 వేలు అందించారు. మిగతా విషయాలు తమ పరిధిలో లేవన్నారని ఉద్యోగులు చెబుతున్నారు.

దాతలు ఆదుకోవాలి..

ఆపదలో ఉన్న ఎందరికో ప్రమాద సమయంలో సేవలు అందించిన స్వప్న.. తమను ఆపదలో వదిలి వెళ్లిందని కుటుంబీకులు తెలిపారు. ప్రభుత్వం, 108 సంస్థతోపాటు దాతలు ఆదుకోవాలని, సాయం చేసేవారు 9493003574 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్‌పే చేయాలని వారు ప్రార్థిస్తున్నారు.

వివాహ వేడుకకు వచ్చి.. అనంత లోకాలకు..

- సూర్యాపేట రహదారిపై ప్రమాదం
- మహిళ దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు



బుజ్జి మృతదేహం





తీవ్రగాయాలపాలైన మోహన్‌రెడ్డి, నవీన్

దేవరుప్పుల: వివాహ వేడుకకు వచ్చి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి శివారులో జనగామ–సూర్యాపేట రహదారిపై జరిగింది. ఎస్సై ఎస్.చెన్నకేశవుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురానికి చెందిన ధారావత్ నవీన్ తన తల్లి బుజ్జి(50)ని తీసుకొని దేవరుప్పుల మండలం ధర్మాపురంలో జరిగిన తన బాబాయి కొడుకు వివాహానికి హాజరయ్యారు. తిరిగి మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. గొల్లపల్లి బస్‌స్టేజీ వద్దకు రాగానే ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆకవరం మోహన్‌రెడ్డి బైక్‌పై రోడ్డు క్రాస్ చేసి వెళ్తుండగా నవీన్ అదుపు తప్పి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుజ్జి మృతిచెందగా, మోహన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని గండిపేట వద్ద చికెన్ సెంటర్ నడిపి జీవిస్తున్న నవీన్ నాయక్ వివాహానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో తల్లిని కోల్పోవడంతో బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సంఘటన స్థలాన్ని ఎస్సై చెన్నకేశవులు పరిశీలించారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి



రవి(ఫైల్)

ఖానాపురం : నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని కొత్తూరులో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కదారి రవి(40) హమాలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల తమ బంధువు మృతి చెందగా కుటుంబీకులతో కలిసి దశ ఖర్మకు హాజరయ్యాడు. అనంతరం ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు. తల్లి కొంరమ్మ నీటిసంపులో పడిన కుమారుడిని చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి రవిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య రమ, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి కొంరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో బావిలో పడి రైతు..



మాన్‌సింగ్ మృతదేహం

గూడూరు: విద్యుత్‌షాక్‌కు గురైన ఓ రైతు.. బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని చంద్రుగూడెం సమీప తాళ్లతండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన మాలోతు మాన్‌సింగ్ (55) సోమవారం ఉదయం తన ఇంటికి సమీపంలోని వ్యవసాయ బావి నుంచి వరి పంటకు నీరు పారించడానికి విద్యుత్ మోటార్ వద్దకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేయగా నీళ్లు పోయలేదు. దీంతో లెవెల్ కోసం నీళ్లు పోస్తూ మోటార్‌ను పట్టుకున్నాడు. ఆ మోటర్ ద్వారా విద్యుత్ షాక్ తగలడంతో వెంటనే బావిలో పడ్డాడు. గుర్తించిన పక్కనే ఉన్న తమ్ముడు లాల్‌సింగ్ వెంటనే బావిలోకి దిగి మాన్‌సింగ్‌ను పైకి లాగాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహాలు లభ్యం



లభ్యమైన మృతదేహం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువలో ఈ నెల 16వ తేదీన చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. బిహార్‌లోని రాధ్‌కేత జిల్లా భారతి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(20), దీపక్‌కుమార్(20) ఎల్కతుర్తి శివారులోని రామ్‌రేవ్‌కు చెందిన లక్ష్మీగణపతి గ్రానైట్ సంస్థలో టేకేదార్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరు ఈనెల 16వ తేదీన స్థానిక ఎస్సారెస్పీ కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లారు. అనిల్‌కుమార్ కాలువలోపడి కొట్టుకుపోతుండగా అతడిని కాపాడానికి దీపక్ కూడా దూకాడు. నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఇద్దరు గల్లంతయ్యారు. వీరితోపాటు వెళ్లిన మరో ఇద్దరు అరుణ్‌రామ్, మనోజ్‌రామ్ సెల్ ఫోన్ ద్వారా గ్రానైట్ యజమానికి సమాచారం ఇవ్వగా ఆయన హుటాహుటిన కాలువ గట్టుకు వెళ్లి చూడగా వారి చప్పులు కనిపించడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఒక మృతదేహం చింతగట్టు క్యాంపు వద్ద లభ్యం కాగా, మరోటి గీసుగొండ వద్ద లభ్యమైనట్లు తెలిపారు. ఇద్దరి మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ WGL కాజిబుగ్గ ఏనుమాముల రోడ్ బాలాజీ సర్కిల్ దగ్గర తూర్పు ఫేస్ 146 గజములు (30 ఫీ॥ రోడ్) 30x44 గల స్థలం అమ్మబడును. Sq.yard 28K. సంప్ర॥ 7780386570. [W-1264908]

■ GWMC & KUDA అప్రూవ్‌డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును, కేవలం 15000/-లకు గజం మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264855]

SERVICES

■ హౌస్, ప్లాటు, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. సెల్: 8790379618. [WA-7298]

■ హౌస్, ప్లాటు, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. సెల్: 7842279342. [WA-7297]

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్. 9550606222. [H-787738]

WANTED

■ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ / యువకులు అర్జెంట్‌గా కావలెను. జీతం+ఇన్సెంటీవ్స్ + కమీషన్స్ ఇవ్వబడును. సంప్ర॥ 9849611060. [WA-1264907]

■ GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ & LAB టెక్నీషియన్స్ అనుభవం గలవారు కావలెను. సంప్రదించండి: గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్ 12 to 2PM. [WA-0364]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233892]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18k. ఫోన్: 9160900024 / 9640400073. [H-799854]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233895]

WANTED TEACHERS

■ Wanted (E/M) Female Trained Teachers for (Nur-II) & Male Teachers for (III-VII) All sub. From WGL Local only - Dharmaram, Geesugonda, WGL (R) - 9989324881. [WA-1264951]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.